పోర్ట్రైయిట్

డాక్టర్ టి.జి.ఆర్.ప్రసాద్

పిండారబోసినట్టు వెన్నెల.

చెట్ల ఆకుల సందుల్లోంచి అమృత కిరణాల్ని వర్షిస్తూ ఆకాశం భూమ్మీద తన ప్రతిబింబాన్ని నింపాదిగా చూసి కొంటోంది.

ఆ శ్వేతబాట వెంబడి ఓ తెల్లని గుర్రం వెళ్తోంది. దాని మీద ఓ సౌందర్య అధిదేవతా మూర్తి. మహోత్సాహంతో, అవధిలేని ఉల్లాసంతో, మేరలేని సంతృప్తితో ఆమె ఎక్కడికో తాపీగా వెళుతోంది. దానికి నిదర్శనం— ఆమె ప్రశాంత వదనం, ఆమె పెదాల మీద లాస్యం చేస్తున్నది — చిక్కని వెదరని చిరునవ్వు!!! ఆమె ఎవరు? ఎక్కడినుండి వస్తోంది? ఎక్కడికి వెళుతోంది? ఎందుకు పోతున్నది? మనకు తెలీదు.



వెళుతున్న గుర్రం డెక్కల చప్పుడు వినకపడిన అతడి గుండెల నవ్వడి.

రేగిన పెంధూళి అతడి ఊపిరి.

వినక ఆర్తిలో, తృష్ణలో, ఆశలో కుంచె పట్టుకొని వెంటపడ్డ అతను ఏ బికారో? సాంఘుడో? కళాపిపాసో? అతగాడు మనకు ఎవరైతేనేమి?

అతను ఆమె కోసం వస్తున్నాడు. అది నిజం. అందులో ఏ కోరికా లేదు. కాని స్పర్శకోసం, తెలీని అనుభూతి కోసం తహతహ ఉండినా తప్పులేదు.

నిశ్శబ్ద సంగీతంలోని నీరవ మాధుర్యం నిండిన ఆమె చిరునవ్వుని చిత్రిక బట్టాలని అతని తపన — తాపత్రయం — ఆందోళన — అనిశ్చిత — అశాంతి — అలసత్వం — లాలస అతని జీవితమూ, దాని పరమార్థమూను.

ఆమె వెనక్కి చూడకుండా కాంతిలా సూటిగా ధాటిగా ప్రయాణిస్తోంది.

తన వెంటపడ్డ ఆ ఉన్మాది గురించి ఆమెకు తెలుసా? తెలిసి తెలియనట్లు నటిస్తోన్నదో? నిజంగా తెలియదో కాని ఆమె పొరబాట్లో కూడా వెనక్కి చూడటం లేదు. చూసేలా కన్పించటం లేదు.

చూస్తే ఏమౌతుంది? ఊహాతీతమైన, అనూహ్యమైన విషయాల్ని గురించి ఆలోచించే పరిజ్ఞానం నాకు లేదు.

తనకోసం ఆగి, గుర్రం మీదికి చేయూత నిచ్చి ఎక్కించుకొంటుందని ఆ వెర్రివాడి పిచ్చి నమ్మకం.

అది కాబోయే వాస్తవ మో, రంగుల కలో నాకు తెలీదు, కాలమే చెప్పాలి.

వాడి స్వాప్నిక జగత్తులోని సమాధిని భగ్నం చేయడానికి మనం ఎవరం? నిజం మీకు తెలిసినా వాడి విశ్వాసాన్ని కొల్లగొట్టకండి. అది అమానుషం. అతి దారుణం.

ఉన్నట్టుండి ఆ గుర్రం రెక్కలొచ్చిన దానిలా, సంధించి వేసిన బాణంలా రివ్వున దూసికెళ్లటం ప్రారంభించినది. కమ్మిన ధూళి అతని దృష్టిని నీటి మీద వ్రాతను చేస్తోంది. ఆ గలాటాలో అతని చేతిలోని కుంచె కాస్త జారి ఎక్కడో పడిపోయింది. ఎక్కడ పడింది? వెతకాలా? వద్దా? ఈ లోగా ఆమె కనిపించకుండా అదృశ్యం అయితే? జీవం గడ్డకట్టుకొని పోదూ?

ఆలోచించే వ్యవధిలేనప్పుడు ఎక్కడ ఉంటుంది సందేహడోల...అతను ఆమెని వెంబడించటం మానలేదు. అతను రొప్పుతూ రోజుతూ పడే ప్రయాసని చూస్తే జాలి పుట్టవచ్చు. మృగతృష్ణ వెంబడి పడ్డాడని మీరు వెక్కిరించవచ్చు. కాని ఆ దాహం ఉంటే మీరయినా అలా చేస్తారేమో? ఎవరు చెప్పగలరు? ఎవరు చూడొచ్చారూ?

అక్కడోకూడలి.. ఎన్నో మలుపులు. అదే అతని జీవితానికి ముగింపు. కావ్యం విషాదాంతమో? సుఖాంతమో? చెప్పతాను 'రా' రమ్మంటోంది కాలం అక్కడ పీటవేసికొని కూర్చొని.

గుర్రం ఆ కూడలిని సమీపిస్తోంది. తాను ఏ మార్గంలో వెళుతుందో తెలిసీ పట్టుకోలేని తాను ఆమె ఆ కూడలిని దాటేందంటే పట్టుకోడం అసంభవం — అసాధ్యం — అసహజం అని అతనికి బాగా తెలుసు. అందుకే అతనిలోని జీవధారలన్నీ ఒకటయ్యాయి.

మానవుడి ఇంటలెక్ట్ ఎంత ఉన్నా అక్కడ బూడిదలో పోసిన పన్నీరే.

మనిషి 'విల్'కి లక్షణం అగ్ని పరీక్ష!!! ఎందుకంటె అతను ముందు ఎన్నోసార్లు అనుకొన్నట్లు అతని జీవితం అతను జీవించిన అన్ని ఏళ్ళలో లేదు. దాని సాఫల్యత ఆ క్షణంలోనే. ఆ లిప్త పాటులోనే. అందుకే నాకు అన్పిస్తోంది ప్రతి వ్యక్తికీ ఏదో ఒక్క క్షణమే వాడి జీవితం అని. ఆ క్షణంలో వాడు జీవించ లేకపోతే వాడే చరిత్ర హీనుడు. వాడి బ్రతుకే రోడ్డు పక్కన పూసే పిచ్చి గంటపువ్వు అవుతుంది.

ఎక్కడో ఓ అనంతలహరి భూగోళాన్ని మొత్తం ముంచేయాలని నాలుగు వైపుల నాలుకలు చాచుకొని వచ్చి చెలియలి కట్టకి బలి అయిపోయింది.

మరెక్కడో ఓ పెద్ద అలమిన్నును అంటాలని ఆపుకోలేని ఉద్రేకంతో ఉబలాటంతో పైకిలేచి నడుం విరిగి ముక్కలు చెక్కలై చెల్లా చెదరై పడిపోయింది.

ఆకారం లేని ఓ నక్షత్రం నిశివేళ పగల్లా నవ్వే ఆ నక్షత్రానికి ఏదో తగిలి నుసిలా నేలరాలింది!

ఎవరో బిగ్గరగా సకలించిన వప్పుడు. ఎక్కడో చిమ్మ చీకటికి నిండు గర్భస్రావం!

ఆ నవ్వు! కెరటం ఒడ్డున చార ఏర్పరచినట్లు గాలిలో ఏవో పిచ్చి గీతలు గీస్తోంది చిత్రకారిణిలా! దానిలోని దివ్యత్వం, అమరత్వం, మధురత్వం, తన్మయత్వం, శాశ్వతత్వం, సత్యం—శివం—సుందరం కోసం అతగాడు విసుగులేని పాంథుడయ్యాడు. ధాన్ని తన గళం కుంచెలోనించి విదిలించి వేలాది కళార్తులకి తనివిదీరా విందు చేద్దామని అడియాశ పడ్డాడు.

గుర్రం వేసట లేకుండా వేగంగా పోతుంది. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసలు వృద్ధి పొందాయి. కాని క్రమేణ అతని వేగం క్షీణిస్తోంది. కాని అతనిలోని తీరని కోరిక వింతగా మూర్ఖంగా పెరిగిపోతోంది. ఎందుకో!

తన అశక్తత మీద అసహనం, అసహ్యం, జుగుప్స— మరుక్షణంలో అంతులేని జాలి. మరో క్షణంలో తనను తాను నరుక్కోవాలనే కసి.

ఏదో చెట్టు మోడు మొదలు తగిలి అతను బోర్లబొక్కలా పడ్డాడు.

గుండెలో ఏదో కసిక్కున దిగింది!

రక్తం చివ్వున ఫౌంటెన్‌లా చిమ్మింది.

అతని రెండో చేతులోని రంగులన్నీ ఆ రుధిర ప్రవాహంలో కలిసి విచిత్రంగా మారాయి.

ఏదో నవ్వు. పెద్ద అపహాస్యం. ఆ నవ్వు క్షణం క్షణం పెరిగి ప్రకృతిలో వికటంగా ప్రతిధ్వనిస్తూ అతని చెవుల్లో హోరెత్తిస్తున్నది.

కాని ఆశ్చర్యం! ఎండిన ఆ గుండెలో ఏవో అనంత కడలి నుడులు. ఒక్క ఉదుటున లేచి రాకెట్‌లా ఆమె వెంట పడ్డాడు. ఆరిపోయే దీపం వెలుగది.

ఆ గుర్రం వెనుక భాగం అస్పష్టమవుతోంది. చిన్నగా, ఇంకా చిన్నదిగా, చుక్కగా మారిపోయింది.

అతని గుండె కలుక్కుమంది. ఏ రక్త నాళమో తెగిన నిక్వణం.

గుండె చేత్తో పట్టుకొని అతను నేలగూలాడు. విస్వనం. కరిగిపోయే ఆ నవ్వుకి శాశ్వత రూపం ఇచ్చే దెవరు? యిచ్చేది ఎలా? ఏవిధంగా వివరించి అందరికి అందులో తాము చూసిన ఆపాత మధురత్వాన్ని విశదీకరించాలి?

ఎలా? ఎలా? ఎలా?

ఇంకెందుకీ బుదుద జీవితం? రక్తమాంసాల కళేబరం ఇంకెందుకు? ఆత్మహత్య చేసుకొన్నాడు!!!

అది చరిత్రలో మరో రక్తపు మరక.

మానవ త్వానికే అది తీరని మచ్చ.

ఆ నవ్వుని చూసిన ఎవరయినా మరే సౌందర్యాన్ని పునః సృష్టి చేయగలరు?

అది శూన్యమా? అనంతమా?

అనంతమైన శూన్యమా? శూన్యమైన అనంతమా? అనంతమైన ఆనందమా? విషాదమా? అది పరిధిలేని ఓ వృత్తం. దానిలో ప్రతి బిందువూ కేంద్రమే!

అసలు ఓడ ఎక్కిన వాడు ఓడకంటే ముందుగా దరి ఎలా చేరగలడు???

మద్రాసులో రాజాలక్ష్మీ అవార్డ్స్ ప్రదానోత్సవం

1979 నుంచి రాజాలక్ష్మీ అవార్డ్స్ శ్రీ రాజాలక్ష్మీ ఫౌండేషన్ వారు యిస్తూవచ్చారు. పదవ అవార్డ్‌ను *(1987)* ప్రభుత్వ న్యూరో సర్జన్ డాక్టర్ బి. రామమూర్తి గారికి మద్రాసు రాణీ సీతయ్ హాలో ఆనాటి సభకు ముఖ్య అతిథి, అధ్యక్షులైన కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ జలగం వెంగళరావు గారిచేత యిప్పించారు. (పక్క పేజీలోని ఫోటోలు ఉత్సవ వైభవాన్ని కళ్ళకు కట్టినట్లు ప్రదర్శిస్తున్నాయి). రాజాలక్ష్మీ ఫౌండేషన్ వారు *1987*లో కొత్తగా ప్రవేశపెట్టిన రాజా లక్ష్మీ లిటరరీ అవార్డ్ క్రిందరు.*5000/-* కళా ప్రపూర్ణ రావూరి భరద్వాజకు యిచ్చారు.

డాక్టర్ రామ్మూర్తిగారికి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ యిచ్చి సత్కరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన న్యూరో సర్జన్ రామ్మూర్తిగారు కొంత సేపు తెలుగులో, కొంత సేపు ఇంగ్లీషులో చాలా చక్కగా చమత్కారంగా విట్లూ జోకులూ విసురుతూ మాట్లాడారు.

శ్రీ రావూరి భరద్వాజ గారు కూడా సాహితీ వేత్తగా, బహుముఖ ప్రజ్ఞా శాలిగా స్వీయ జీవితానుభవాన్ని ఒక కథలా మలిచి చెప్పి సభికులను ఆలోచింప చేశారు. ఈ సభలో తెలుగు కళా సమితి న్యూ జెర్సీ నుంచి శ్రీ కిళాంబి రఘునాథ్, డాక్టర్ కె.వి. రావు, డాక్టర్ జ్యోతిరావులు పాల్గొనడం గొప్ప విశేషం. డాక్టర్ కె.వి. రావు దంపతులకు వేదికపై రాజ సమ్మానం జరిగింది. సభా ప్రారంభంలో శ్రీ కె. శివప్రసాద్ పార్టీ వారు ఈల పాట కచ్చేరీ చేసి సభికులను ఆనందపరిచారు. డాక్టర్ కాంతామణి సుందర్ ఆహ్వానించగా సభాంతమందు శ్రీ పి.వి.ఆర్. కృష్ణారావు వందన సమర్పణ చేశారు. శ్రీ రాజాలక్ష్మీ అవార్డ్ ఉత్సవానికి వున్న ప్రత్యేకతను, హుందాతనాన్ని ఆనాటి సభ నియుక్తి కోవడమేగాక సుజన రంజకంగా సాగింది.